సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

విశాఖ: రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ కాపాడారు. బాధితులు విజయనగరం జిల్లాకు చెందినవారు.



స్థాయీ ఎన్నికల బరిలో 20 మంది

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు నిలిచినట్టు అదనపు కమిషనర్ వర్మ ప్రకటించారు.



భారీ టేకు చేప

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం తీరంలో మత్స్యకారులకు వెయ్యి కేజీల భారీ టేకు చేప చిక్కింది. స్థానిక వ్యాపారి రూ.2 వేలకు కొనుగోలు చేసి కాకినాడ తరలించాడు.

న్యూస్‌రీల్

రొయ్యల పరిశ్రమలో క్లోరిన్ లీక్

- 20 మంది మహిళలకు అస్వస్థత
- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు
- ప్రమాదం లేదని నిర్ధారణ.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్



అడ్డురోడ్డు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ఎస్.రాయవరం: రొయ్యల పరిశ్రమలో క్లోరిన్ లీక్ అయి అక్కడ పనిచేస్తున్న 20 మంది మహిళలు అస్వస్థతకు లోనయ్యారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం వారిని డిశ్చార్జి చేశారు. ఎస్.రాయవరం మండలంలోని పి.ధర్మవరం సమీపంలో ఉన్న కోస్టల్ గోల్డ్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో శనివారం కార్మికులు విధులు నిర్వహిస్తుండగా 5 లీటర్ల క్లోరిన్ డబ్బా సుమారు మీటరు ఎత్తులో నుంచి కింద పడింది. దీంతో ఆ డబ్బాలో క్లోరిన్ చెల్లాచెదురుగా పడి దాని గుణాన్ని చూపించింది. సమీపంలో 20 మంది మహిళలు, ఐదుగురు పురుషులు వాసనకు ఇబ్బందులు పడ్డారు. ఊపిరి పీల్చుకునే క్రమంలో దగ్గు వచ్చి కేకలు వేశారు. కొందరు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన పరిశ్రమ యాజమాన్యం వెంటనే అడ్డురోడ్డు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. మోతాదు తక్కువ కావడంతో ఎవరికీ ఏమీ కాలేదు. చికిత్స అనంతరం బాధితులను డిశ్చార్జి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసే వరకు గ్రీవెన్స్ రద్దు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రద్దు చేసినట్టు డీఆర్వో వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసన మండలి స్థానాన్ని భర్తీ చేయడానికి సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఈ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. మరలా ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

మీరు డాక్టరవుతారా... కలెక్టరా?


- విద్యార్థులతో ముచ్చటించిన జడ్జి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజి ఖాన్

నాతవరం: 'మీలో ఎవ్వరూ డాక్టరు, లాయరు, పోలీసు, కలెక్టరు, ఉపాధ్యాయుడు అవుతారు? అంటూ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజి ఖాన్ పలువురు విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బోధన ఎలా ఉందని ఆరాతీశారు. ఇప్పట్నుంచి బాగా చదువుకుంటే కచ్చితంగా అనుకున్న లక్ష్యం సాధిస్తారని ఉద్బోధించారు. మండలంలోని సరుగుడులో వైద్య శిబిరానికి శనివారం ఆయన హాజరై ఆకస్మికంగా ఇక్కడ పాఠశాలలో తరగతి గదులను కలియ తిరిగారు. ఈ సందర్భంగా 4, 5 తరగతుల విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. విద్యార్థుల సంఖ్య తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేరని, పూర్తిస్థాయిలో బోధించడానికి ఇబ్బంది అవుతుందని హెచ్‌ఎం సత్యనారాయణ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై డీఈవో దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం గిరిజనులు ప్రధాన సమస్యలపై ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ గంగరాజు, గ్రామ పెద్దలు జడ్జికి వినతి పత్రం అందజేశారు. విశాఖ కేజీహెచ్‌లో పాడేరు ఐటీడీఏ గిరిజనులు మాదిరిగా మైదాన ప్రాంత గిరిజనులకు వైద్య సేవలందించాలన్నారు. నాతవరం మండలంలో 1/70 యాక్టు పరిధిలోని గిరిజన గ్రామాలను పాడేరు ఐటీడీఏ పరిధి కొయ్యూరు మండలంలోకి విలీనం చేయాలని కోరారు.

పశుగణనపై శిక్షణ



అనకాపల్లి: పశుగణనపై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం అనకాపల్లిలో విజయవంతంగా నిర్వహించారు. మాడుగుల, చీడికాడ, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం, గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల నుంచి ఎన్యుమరేటర్లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బెహరా ప్రసాద రావు వారిని ఉద్దేశించి మాట్లాడారు.

మూడు శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కులకు వరమైంది. పోలవరం కాలువ పటిష్టత కోసం వేసిన గ్రావెల్, మట్టిని తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటుంటే.. దాన్ని అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, మైనింగ్, పోలవరం ప్రాజెక్టు అధికారులు.. ఆ బాధ్యత మాది కాదంటే.. మాది కాదని తప్పించుకుంటున్నారు. పర్యవసానంగా పోలవరం కాలువ గట్లు బలహీనపడి వర్షాల సమయంలో వరద ముంపు తప్పదని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పీఎల్‌పురం పోలవరం కాలువ గట్ల వద్ద గ్రావెల్ తవ్వుతున్న ప్రదేశం

పోలవరం కాలువకు ముప్పు

- గట్లను తవ్వేసి గ్రావెల్ తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న రియల్టర్లు
- బలహీనపడుతున్న గట్లు
- సమీప గ్రామాలకు వరద ముంపు
- మూడు శాఖల మధ్య సమన్వయ లోపం

నక్కపల్లి/పాయకరావుపేట: పోలవరం కాలువ నిర్మాణంలో వచ్చిన మట్టిని, గ్రావెల్‌ను గట్టుపై వేసి పటిష్టం చేస్తుంటే, దానిపై కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అక్రమార్కులు కన్నుపడింది. మట్టి, గ్రావెల్‌తోపాటు తవ్వకాల్లో వచ్చిన రాయిని సైతం తరలించి బయట వ్యక్తులకు విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే నిత్యం వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీనిపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత శాఖల వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 5,6,7 ప్యాకేజీల కింద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని పాయకరావుపేట నుంచి కశింకోట వరకు 50 కిలోమీటర్ల మేర చేపట్టారు. పనులు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టిని కంకర, గ్రావెల్ పక్కనే వేసి గట్లు ఏర్పాటు చేశారు. సుమారు 30 నుంచి 50 అడుగుల ఎత్తున ఈ గ్రావెల్‌తో పటిష్టమైన గట్లు ఏర్పాటు చేస్తే అక్రమార్కుల కళ్లు వీటిపై పడ్డాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు గట్లను తవ్వేసి గ్రావెల్‌ను, మట్టిని తరలించుకుపోయి లేఅవుట్లలో రోడ్లు వేసుకుంటున్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు మట్టి, గ్రావెల్ తవ్వేసి



తవ్వకాల వల్ల బలహీన పడుతున్న గట్లు

యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు.

ఎక్కడెక్కడ అంటే...

పాయకరావుపేట మండలంలో పీఎల్‌పురం, సీతారామపురం, పాయకరావుపేట సమీపంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలు, నక్కపల్లి మండలంలో గుల్లిపాడు, రమణయ్యపేట, పెదదొడ్డిగల్లు, సీతంపాలెం, ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం, దార్లపూడి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, యలమంచిలి మండలం ఏటికొప్పాక, కొక్కిరాపల్లి, కొత్తలి, ఎర్రవరం తదితర తదితర గ్రామాల్లో ఇలా నిత్యం వందలాది ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. దీనిని పోలవరం ప్రాజెక్టు అధికారులుగాని, రెవెన్యూ, మైనింగ్ అధికారులుగాని పట్టించుకోవడం లేదని సమీప గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. ఇలా మట్టి తవ్వేయడం వల్ల కాలువ గట్లు బలహీన పడి భారీ వర్షాలు, తుపాన్లు వచ్చినప్పుడు వర్షపు నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదముందని సమీప నివాస ప్రాంతాలవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు...

ట్రాక్టర్ గ్రావెల్ రూ.800 నుంచి రూ.1200లకు విక్ర



ట్రాక్టర్లపై మట్టిని తరలిస్తున్న దృశ్యం

యిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు వేసే లేఅవుట్లతోపాటు, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని కంపెనీలకు విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కాలువ మట్టి, గ్రావెల్ పరిరక్షించాల్సిన బాధ్యత, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులదే, అయినప్పటికీ వారెవరూ కాలువ గట్ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో రియల్టర్ల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలవరం గ్రావెల్ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల సహకారంతో అడ్డుకుంటాం

పోలవరం కాలువ గట్ల పటిష్టత కోసం వేసిన మట్టి, గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. కాలువలను తవ్వి గట్లు వేయడం వరకు మా బాధ్యత. వాటిని పరిరక్షించడం, గ్రావెల్, రాయి తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత ఇరిగేషన్ వారిదే. ఇరిగేషన్, మైనింగ్ వారు సంయుక్తంగా దాడులు నిర్వహించాల్సి ఉంది. పలు పర్యాయాలు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకుని మైనింగ్, పోలీసు వారికి అప్పగించాం. జరిమానాలు విధించారు. అయితే ఎక్కువగా రాత్రిళ్లు తవ్వకాలు చేస్తున్నారు. ఆ సమయంలో ట్రాక్టర్లను అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దూసుకొస్తున్నారు. అందువల్ల తవ్వకాలను అడ్డుకోవడానికి పోలీసు బందోబస్తు కోసం లేఖ అందజేశాం.

– సుబ్రహ్మణ్యం ఏఈ, పోలవరం ప్రాజెక్టు (ఎడమ కాలువ)

తహసీల్దార్లు ఎక్కడ?

రెవెన్యూలో ఇన్‌చార్జిల పాలన

- తహసీల్దార్లకు పోస్టింగ్‌లపై సందిగ్ధత
- ఇప్పటికీ కొలిక్కిరాని కేటాయింపు ప్రక్రియ
- కూటమి నేతల కొట్లాటతోనే ఆలస్యమైన పోస్టింగ్స్
- ఇంతలో స్థానిక ఉప ఎన్నిక షెడ్యూల్
- ప్రస్తుతం అడ్డంకిగా మారిన ఎన్నికల కోడ్

సాక్షి, అనకాపల్లి: మండలాల్లో రెవెన్యూ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఇన్‌చార్జిలే పెద్దదిక్కుగా మారారు. పక్కనున్న విశాఖ జిల్లాలో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ పూర్తయింది. కొత్తగా వచ్చినవారికి పోస్టింగ్‌లు కూడా ఇచ్చేశారు. కానీ అనకాపల్లి జిల్లాలో మాత్రం బదిలీలు, పోస్టింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా చేపట్టిన తహసీల్దార్ల పోస్టింగులు, బదిలీల ప్రక్రియ కూటమి నేతల కొట్లాటతో ఆలస్యంగా సాగుతోంది. బదిలీల ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సులకే అగ్రతాంబూలం ఇచ్చినప్పటికీ.. కీలక మండలాల్లో టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. మూడు పార్టీల నేతల కొట్లాటతో పోస్టింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. పారిశ్రామిక ప్రాంతమైన అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ తహసీల్దార్ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేలు జనసేన పార్టీకి చెందిన వారు కావడం.. అక్కడ బీజేపీ, టీడీపీ వారు కూడా రెండు జాబితాలు సిద్ధం చేయడంతో తుది జాబితా ఎంపిక ఆలస్యమైనట్లు రెవెన్యూ శాఖలో చర్చ జరుగుతోంది. తీరా కలెక్టర్ విజయ కృష్ణన్ చొరవతో తహసీల్దార్ల తుది జాబితా సిద్ధమైనా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు షెడ్యూల్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లాలో తహసీల్దార్ల బదిలీల వ్యవహారం సందిగ్ధంలో పడింది.

రిపోర్టు చేసి వారమయినా..

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 24 మంది తహసీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీరికి కలెక్టరు మండలాలు కేటాయించాల్సి ఉంది. గత శనివారం 21 మంది తహసీల్దార్లు కలెక్టరు విజయ కృష్ణన్‌కు రిపోర్టు చేశారు. ఇంతలో ప్రభుత్వం తహసీల్దార్లకు గతంలో పనిచేసిన డివిజన్లు, మండలాలు కేటాయించవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కలెక్టర్ విజయ కృష్ణన్ జిల్లాకు బదిలీపై వచ్చిన 24 మంది తహసీల్దార్లకు మండలాలు కేటాయించలేదు. ఇది జరిగి వారం రోజులు కావస్తున్నా భూపరిపాలన విభాగం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకపోవడంతో బదిలీల ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లాకు కేటాయించిన 21 మందిలో కొందరు తహసీల్దార్లు తమకు విశాఖపట్నం బదిలీ చేయాలని కోరుతున్నట్లు సమాచారం. విశాఖపట్నం జిల్లాలో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ ఇప్పటికే పూర్తయినా వాటిని రద్దు చేసి, ఉమ్మడి విశాఖపట్నం యూనిట్‌గా తహసీల్దార్ల బదిలీలు నిర్వహించే యోచనలో అధికారులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తహసీల్దార్ల బదిలీలకు కోడ్ వర్తిస్తుందని, మరికొద్ది రోజులు ఆలస్యం కానుందని అధికారులు చెబుతున్నారు.

రెండు రోజుల్లో స్పష్టత..

రెవెన్యూ శాఖలో కీలకంగా వ్యవహరించే తహసీల్దార్ల నియామకాలు ఆలస్యం అయితే పరిపాలనా పరమైన ఇబ్బందులు తప్పవని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే బదిలీల ప్రక్రియ ప్రారంభమైనందున తహసీల్దార్లకు మండలాలు కేటాయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్టు తెలిసింది. దీనిపై ఎన్నికల కమిషన్ నుంచి రెండు రోజుల్లో స్పష్టత రాగానే తహసీల్దార్ల బదిలీలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

అధికార పార్టీకి 'కోడ్' వర్తించదా?



ఎస్.రాయవరంలో ముసుగుతో వైఎస్సార్ విగ్రహం



ఎస్.రాయవరంలో తొలగించని అధికార పార్టీ ఫ్లెక్సీ

ఎస్.రాయవరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో మండల అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు కోడ్ అమలులోకి వచ్చి మూడు రోజులు గడుస్తున్నా, అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. కోడ్ వచ్చిన రెండు రోజుల్లోనే పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులు అధికార పార్టీ ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. ఇది చూసి ఎన్నికల కోడ్ వర్తింపు ప్రతిపక్ష పార్టీ నాయకుల విగ్రహాలకేనా, అధికార పార్టీ వారికి వర్తించదా? అని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎస్.రాయవరంతో పాటు వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డు, కోరుప్రోలు గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో బాలాజీ
- దిమిలి పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

రాంబిల్లి (యలమంచిలి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో బాలాజీ దిమిలి పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి.. ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ సమస్యలపై ఒక స్టాఫ్ నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరు, రికార్డుల పర్యవేక్షణ, రోగులకు అందుతున్న సేవలపై ఆస్పత్రి సిబ్బందిని, రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ సిబ్బందిపై స్థానికులు కొందరు ఆరోపణలు చేశారని, సక్రమంగా పనిచేయని అధికారులపై విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులకు రెండు రోజుల్లో షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి.. 3వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 27వ తేదీతో ముగుస్తుందన్నారు. అభ్యర్థుల మొబైల్ నంబరు, ఈ మెయిల్ ఐడీ ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదన్నారు. అభ్యర్థుల ఆధార్ వివరాలు, ఎస్ఎస్‌సీ సర్టిఫికేట్ వివరాలకు సరిపోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 29న నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికేట్లతో అభ్యర్థులు హాజరు కావాలన్నారు.


పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం




అడహక్ కమిటీ సభ్యులతో ఎస్పీ దీపిక

అనకాపల్లి: విధి నిర్వహణలో మృత్యువాత పడిన జిల్లా పోలీసుల కుటుంబ సభ్యులను ఆదుకునే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ ఎం.దీపిక చెప్పారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం (అడహక్ కమిటీ) ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల పిల్లలకు ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ వంటి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు, కార్యదర్శి కుమార్‌స్వామి, కోశాధికారి హెచ్.సి.లలిత, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సభ్యుడు గిరి, మోహన్, మొహిద్దీన్, రమణ, హెచ్‌సీమల్లీశ్వరి, హెచ్‌సీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు



శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి: జిల్లాలో 120 ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ తర్ఫీదు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ వారం రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆమె మాట్లాడారు. ఎన్‌సీసీ మాదిరిగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొంటున్న విద్యార్థులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. నూతన జిల్లాలో మొదటిసారిగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం వలన విద్యార్థులతోపాటు, అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో దశలవారీగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎ.వి.రత్నకుమారి, శిక్షకులు డి.వేణుగోపాల్, షరీఫ్, లియో అంథోని, నాగరాజు, సోమునాయుడు, ఎస్.వి. రమణ, తదితరులు పాల్గొన్నారు.

- కూటమి కుటిల రాజకీయం

వేధింపులతో రాలిపోయిన ప్రాణం



బాబూరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య దుర్గ, కుమార్తె దుర్గలక్ష్మి, బంధువులు



బాబూరావు నిర్వహిస్తున్న దుకాణాలు

కశింకోట: కుటిల రాజకీయాలకు ఒక నిండు ప్రాణం బలైంది. కుటుంబం రోడ్డున పడింది. బయ్యవరం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీకి చెందిన వార్డు సభ్యుడు గొల్లవిల్లి బాబూరావు (39) మృతితో కుటుంబ సభ్యులు అనాథలుగా మిగిలారు. చెరువు వద్ద స్వీట్, బేకరీ దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబ జీవనం సాగిస్తున్న బాబూరావుపై అధికార కూటమి నాయకులు పగ బట్టారు. వారి ఒత్తిడితో రెవెన్యూ అధికారులు దుకాణాల తొలగింపునకు నోటీసు ఇచ్చారు. ఇందుకు మనస్తాపం చెందిన బాబూరావు పురుగుల మందు తాగి ఇటీవల ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టాడు. దీంతో మానవతా దృక్పథంతో దుకాణాలను తొలగించకుండా చూడాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మండల నాయకులు తహసీల్దార్‌ను కలిసి ఇటీవల కోరారు. అయినప్పటికీ తాజాగా మళ్లీ నోటీసు ఇచ్చి.. దుకాణాన్ని తొలగిస్తామని రెవెన్యూ సిబ్బంది చెప్పడంతో బాబూరావు మనస్తాపం చెంది చున్నీతో ఉరి పోసుకొని శనివారం తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండటం చూపరులను కలచి వేసింది. మృతునికి భార్య దుర్గ, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమార్తె దుర్గలక్ష్మి, పశ్చిమ గోదావరి జిల్లా చేబ్రోలు వద్ద తమ బంధువుల ఇంట్లో ఉండి 8వ తరగతి చదువుతున్న కుమారుడు పూర్ణేష ఉన్నారు. బాబూరావు మృతితో ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. దూరంగా చేబ్రోలులో ఉండి చదువుకుంటూ మరణ వార్త తెలిసి ఆదరా బాదరాగా వచ్చిన కుమారుడు పూర్ణేష రోదనను ఆపడం ఎవరి తరం కాలేదు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, తదితరులు కుటుంబానికి సానుభూతిని తెలిపారు. రాజకీయంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధించడం కూటమి నాయకులకు తగదని వారన్నారు. దుకాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ఒడిగట్టాడన్నారు.

ఆనందంలో నీకు తోడు ఉండకపోవచ్చు కానీ విషాదంలో నీవెన్ను వీడడు... నిన్ను ఆటపట్టించ వచ్చు కానీ ఎదుటి వ్యక్తి నిన్ను హేళన చేస్తే సహించ డు... తల్లిదండ్రులు, సోదరులు, బంధువుల ప్రేమను తలపించే ఆప్తుడు... ముందుండి నడిపించే స్నేహితుడి గురించి ఎంత చెప్పినా తక్కువే... మిగతా బంధాలన్నీ కుటుంబ వరంగా వస్తే స్నేహ బంధం మాత్రం నువ్వు పొందే అరుదైన వరం.. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా...



స్నేహమే 'పంచ' ప్రాణాలుగా..


స్నేహితులు జగన్‌మోహన్, ప్రకాష్, ప్రసాద్, యాసిన్, దేముడుబాబు

మాడుగుల రూరల్: స్నేహం కన్న మిన్న లోకాన లేదురా, కడదాక నీడలాగా నిను వీడి పోదురా.. అని ఓ సినీ కవి చెప్పినట్టుగా ఈ ఐదుగురూ స్నేహంలో మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఒకే ప్రాణంగా మెలుగుతున్నారు. వేర్వేరు గ్రామాలకు చెందిన సూర్రెడ్డి జగన్‌మోహన్, షేక్ యాసిన్, వంటాకు ప్రసాదు, పైలా దేముడు బాబు, సుంకర ప్రకాష్‌లు 1991 సంవత్సరంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివారు. వీరంతా ఒకే రూమ్‌లో కలిసి ఉంటూ కళాశాలలో చదువుకున్నారు. అక్కడ వీరి మధ్య స్నేహం చిగురించింది. తరువాత వేర్వేరు ప్రాంతాల్లో బీఈడీ పూర్తి చేశారు. 1998లో డీఎస్సీలో ఐదుగురు స్నేహితులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో జగన్‌మోహన్ మాడుగుల మండలం కె.జె.పురం హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, మిగిలిన నలుగురు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. చోడవరం మండలం జన్నవరం హైస్కూల్‌లో షేక్ యాసిన్, కె.కోటపాడు మండలం గొండుపాలెంలో వంటాకు ప్రసాద్, సబ్బవరం మండలం చంద్రంపాలెం స్కూల్‌లో పైలా దేముడుబాబు, పెందుర్తి మండలం చింతల అగ్రహారం హైస్కూలు సుంకర ప్రకాష్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరందరూ కుటుంబాలతో కలిసి చోడవరంలో నివాసముంటుండడంతో వీరి స్నేహం మరింత బలపడింది. అప్పటి నుంచి నిత్యం కలుసుకుంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ స్నేహమేరా జీవితం అంటూ సాగిపోతున్నారు.

చెలిమికి నిర్వచనం ఫ్యాబ్

భీమునిపట్నం: స్నేహానికి ఉన్న విలువ అన్నింటి కన్నా ప్రత్యేకమైనది స్నేహితులు పక్కన ఉంటే ఆ ఆనందం, ఆ బలం వేరు. చదువుకున్న రోజుల్లో స్నేహాలు జీవితంలో స్థిరపడినతరువాత కూడా కొనసాగిస్తూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి(ఫ్యాబ్) సభ్యులు. భీమిలిలో 2014లో కాళ్ల సన్నీ తన స్నేహితులతో కలిసి ఫ్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్నేహితులంతా కలిసి అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఆపదలో ఉన్న స్నేహితులకు సాయ పడడం, పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఏడాదికి రూ.5 లక్షల వరకూ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. పేద స్నేహితుల పిల్లల వివాహాలకు సాయం చేస్తున్నారు, భీమిలిలో అవసరమైన చోట్ల సుమారు రూ.5లక్షలతో 70 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వారు చిన్నప్పుడు చదువుకున్న సెయింట్ ఆన్స్ స్కూల్‌కు రూ.3 లక్షలతో స్మార్ట్ క్లాసుల కోసం ప్రొజెక్టర్, రూ.40వేలతో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. భీమిలి అందాలు, చరిత్రను తెలిపే జయహో భీమిలి అనే వీడియో పాటను చిత్రీకరించి దాన్ని ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా విడుదల చేయగా మంచి ఆదరణ లభించింది.



అనాథ పిల్లల ఆశ్రమానికి కంప్యూటర్ వితరణ

మా వంతు సాయం



పేద స్నేహితులతోపాటు అవసరాల్లో ఉన్న ఇతరులకు కూడా చేతనైన విధంగా సాయం చేయాలన్న ఉద్దేశంలోనే ఈ ఫ్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఇందులోని అందరం బాధ్యతగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తున్నాం. దీన్ని ఇలాగే కొనసాగిస్తు మరిన్ని సేవలు చేయాలన్నదే మా కోరిక.

– కాళ్ల సన్నీ, ఫ్యాబ్ వ్యవస్థాపకుడు, భీమిలి

3,600 హెక్టార్లలో సూక్ష్మసేద్య పథకం అమలు

తుమ్మపాల: జిల్లాలో 3,600 హెక్టార్లల్లో సూక్ష్మ సేద్య పథకం అమలు చేస్తున్నట్టు జిల్లా మైక్రోఇరిగేషన్ అధికారి జి.వి.లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధికి సూక్ష్మ సేద్యం అమలు చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వా లు 60:40 నిష్పత్తిలో 2024–25 ఏడాదికి రూ.17.95 కోట్లతో ప్రణాళిక నిర్దేశించినట్టు పేర్కొన్నారు. డ్రిప్ సేద్యం పరికరాల కోసం నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కలిగి, 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాల మధ్య భూమి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. స్ప్రింకర్ల కోసం 5 ఎకరాల కంటే తక్కువ భూమి రైతులకు 55 శాతం, ఎక్కువ భూమి గల రైతులకు 45 శాతం రాయితీ ఇస్తామన్నారు. భూమి హక్కు పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, ఎఫ్‌ఎంబీతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం


పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న మిథిలేష్

కొటికోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండో రోజు శనివారం కూడా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకు చెందిన జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ ప్రతినిధుల బృందం ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధులైన వైద్యులు అరుణ్ కాదంబ్, మిథిలేష్ సాంబర్ అన్ని విభాగాలను, రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో అన్ని రకాలుగా నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. వైద్య, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు కె. తిరుపతిరావు, యశోధ, ఫీల్డు సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి పాల్గొన్నారు.

పచ్చని చెట్టుపై గొడ్డలి వేటు


నరికివేతకు గురైన భారీ వృక్షం

- 70 వసంతాల నుంచి పెరుగుతున్న భారీ వృక్షం
- హుదుహుద్‌ను సైతం తట్టుకుని నిలబడిన రావిచెట్టు
- స్వార్థంతో నరికించిన ఓ వ్యక్తి
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు


రావి చెట్టు కొమ్మలు

యలమంచిలి రూరల్: మా పాలనలో చెట్ల నరికివేత ఉండదని కూటమి ప్రభుత్వం చెప్పుకుంటోంది.కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. యలమంచిలి పట్టణంలో ఉన్న భారీ వృక్షాన్ని శనివారం నేలకూల్చారు. హుద్ హుద్ తుపానును సైతం తట్టుకుని చల్లని, స్వచ్ఛమైన గాలిని ప్రసాదించిన రావి చెట్టును అక్రమంగా నరికివేసినా సంబంధిత అధికారులకు ఆ దృశ్యం కనబడకపోవడం విచారకరమని పట్టణవాసులు ఆక్షేపిస్తున్నారు. వివరాలివి...యలమంచిలి పట్టణంలోని కోర్టుకు వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఉంది. ఈ గెస్ట్ హౌస్‌కు ఆనుకుని సుమారు 70 ఏళ్ల నుంచి పెద్ద రావిచెట్టు ఉంది. మండువేసవిలో చాలా మంది బాటసారులు, స్థానికులు ఈ రావి చెటు వద్దే సేదతీరేవారు. అటువంటి చెట్టును అక్రమంగా నరికివేసినా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయం.ఎవరో వ్యక్తి తమకు అడ్డువచ్చిందన్న నెపంతోనో,లేక ఈ చెట్టును నరికి విక్రయిస్తే ఆదాయం వస్తుందన్న ఉద్దేశంతోనే శనివారం కూలీలతో నరికివేయించాడు.యలమంచిలి కోర్టుకు వెళ్లే దారిలో ఒక ల్యాండ్ మార్క్‌గా గత కొన్ని సంవత్సరాల నుంచి ఉన్న ఈ వృక్షం ఇప్పుడు గొడ్డలివేటుకు గురై కనిపించకుండా పోయింది. ఈ విషయమై యలమంచిలి ఆర్ అండ్‌బీ ఏఈఈ సత్యవాణిని సంప్రదించగా, ఈ చెట్టు ఉన్న విశ్రాంతి గృహం తమ పరిధిలో లేదని, అది ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల పరిధిలో ఉందని చెప్పారు.ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్ సాయినాథ్‌ను ప్రశ్నించగా విశ్రాంతి గృహం గురించి తనకు తెలియదని చెప్పారు.

తహసీల్దార్,అటవీశాఖాధికారుల దృష్టికి కొందరు విలేకరులు ఈ విషయాన్ని తీసుకెళ్లగా, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లి పరిశీలించారు.నరికివేసిన చెట్టు కొమ్మలు,కలపను ఎక్కడికి తరలించకూడదని ఆదేశించారు. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారా?అని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ మురళి ప్రశ్నించగా నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రక్తహీనత నివారిస్తే వ్యాధులు దూరం

- నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ జియాజీ ఖాన్
- సరుగుడు మెగా వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు


పౌష్టికాహారం గురించి జడ్జికి వివరిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి


వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న నర్సీపట్నం సీనియర్ సవిల్ జడ్జి పటాన్ జియాజీ ఖాన్

నాతవరం: పౌష్టికాహారం తీసుకుంటూ, రక్తహీనతను నివారిస్తే వ్యాధులు దరి చేరవని నర్సీపట్నం సీనియర్ సివిల్‌జడ్జి పటాన్ జియాజీ ఖాన్ అన్నారు. మండలంలోని సరుగుడులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో సరుగుడు, సుందరకోట పంచాయతీల శివారు 16 గిరిజన గ్రామాలకు చెందిన 500 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించి వైద్య శిబిరంలో రోగులకు సివిల్ జడ్జి దగ్గరుండి భోజనాలు, తాగునీరు అందజేశారు. కొండల మీద నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలు, వృద్ధులతో మాట్లాడి వారి ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు. ఆటోలు సమకూర్చడంతో అధిక సంఖ్యలో గిరిజనులు శిబిరానికి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సివిల్ జడ్జి మాట్లాడుతూ గిరిజనులు మూఢనమ్మకాలు వీడాలని, 18ఏళ్లు దాటాక ఆడ పిల్లలకు, 21ఏళ్లు దాటాక మగపిల్లలకు వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని చెప్పారు. ప్రసవాలు పీహెచ్‌సీల్లోనే చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో ఎస్.ప్రశాంతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు కె.అనంతలక్ష్మి, నర్సీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి శివ కృష్ణ, ఉపాధ్యక్షుడు కె.నర్సింహమూర్తి, సీనియర్ న్యాయవాదులు అనిమిరెడ్డి గోవిందరావు, సుర్ల కన్నయ్యనాయుడు, కె.ఆర్.వి. సత్యనారాయణ,రుత్తల అప్పారావు, కొరుప్రోలు వెంకటరమణ జగదీష్ ఏపీపీ డి.జ్యోతి, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ గంగరాజు, వైద్యాధికారులు రాజేష్‌నాయుడు, ప్రసన్న లత, విశాల్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, నాతవరం ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

చోడవరం ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం కమిటీ సభ్యులు


చోడవరం ఆస్పత్రిని పరిశీలించి రోగుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం కమిటీ సభ్యులు

చోడవరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఎస్.వి.నాయుడుతో కూడిన కమిటీ చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం పరిశీలించింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు నియోజకవర్గాలకు ప్రధాన ఆస్పత్రిగా ఉన్న చోడవరం 30 పడకల ఆస్పత్రిలో పూర్తి స్థాయి సౌకర్యాలులేక వైద్యం కోసం వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచాలని డిమాండ్ చేశారు. ఇన్వర్టర్ సరిగ్గా పనిచేయకపోవడంతో కరెంట్ పోయినప్పుడు రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఉన్న అంబులెన్స్ వినియోగంలో లేదని, ఇక్కడ నుంచి అత్యవసర సమయంలో రోగులు అనకాపల్లి, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలన్నారు. గతంలో ఇక్కడ ఉన్న పోస్టుమార్టం గది కూలిపోవడంతో పూర్తిగా నిర్మించలేదని, మృతదేహాలకు పోస్టుమార్టం చేయించడానికి అనకాపల్లి వెళ్లాల్సి రావడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు వారికి సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేసినవారిని, డెలివరీ అయిన వారిని ఒకే వార్డులో ఉంచడం వల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని, అందువల్ల వేర్వేరు వార్డులు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. కొంతమంది ఉద్యోగులు ఇక్కడే దీర్ఘకాలికంగా పాతుకుపోవడం వల్ల వైద్యసేవలు అందించడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిని బదిలీచేసి, రోగులుకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు.రైతుసంఘం జిల్లా నాయకుడు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థుల సమస్యల పరిష్కారంలో 'కూటమి' విఫలం




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు రాము

అనకాపల్లి: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు డి.రాము అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా రెండు రోజుల ప్లీనరీ సమావేశాల్లో భాగంగా మొదటి రోజైన శనివారం స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కేంద్రంలో నేటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. బడుగు,బలహీన వర్గాల విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుకుంటున్నారని, జిల్లా అధికార యంత్రాంగం డిగ్రీ కళాశాల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాలకు సొంతభవనాలు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలని, తల్లికివందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంతభవనం ఏర్పాటు చేసి, వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని, ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గీతాకృష్ణ, కార్యదర్శి రమణ, జిల్లా నాయకులు కేశవ, ధనలక్ష్మి, రాజి,బాలాజీ, శ్రీను, రమేష్,జనార్దన్,జ్ఞానేష్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

17 మండలాల్లో 20 శాతం అధికంగా వర్షాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు


వరి నాట్లు యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఆర్ ముకుందరావు,శాస్త్రవేత్తలు

అనకాపల్లి: ఈ ఏడాది జూన్, జులై నెలల్లో సానుకూలంగా వర్షాలు కురవడంతో రైతులు వరి నాట్లు వేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడిందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో టి అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 మండలాల్లో 20 శాతం కంటే అధికంగా వర్షపాతం నమోదైనట్టు ఆయన తెలిపారు. జూన్‌లో సాధారణ వర్షపాతం కంటే 60శాతం అత్యధికంగాను, జులైలో 28.8 శాతం వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. ఈ వర్షాల వల్ల వరి పంటకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు ఆయన చెప్పారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో సాధారణ వరి విస్తీర్ణం 53,121 హెక్టార్లుకాగా, ఇప్పటికి 3,733 హెక్టార్లలో వరినాట్లు వేసినట్టు చెప్పారు. వరిపంటతో పాటు చెరకు, సజ్జ, మొక్కజొన్న, అపరాల నువ్వులు, వేరుశనగ తదితర ప్రధాన పంటలకు ఈ వర్షాలు మేలుచేశాయని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ రైతులు వరినాట్లు వేసుకునే సమయంలో కూలీల కొరత ఉన్నప్పుడు యంత్రాలను వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, డి.ఉమామహేశ్వరరావు, సీహెచ్.రామలక్ష్మి, వి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'విత్తన బంతులు విసిరే కార్యక్రమం'

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణ పురం పంచాయతీ పరిధిలో సత్యనారాయణ స్వామి కొండపై గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు 'విత్తనబంతులు విసిరే కార్యక్రమాన్ని' నిర్వహిస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు స్థానిక నెహ్రూచౌక్ నుంచి క్లబ్ సభ్యులు అందరూ బయలుదేరనున్నట్టు చెప్పారు. సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న కాలనీ వాసులు

కశింకోట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ స్థానిక గుర్రం జాషువా కాలనీలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. డప్పులు కొట్టి బాణ సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎంఎస్పీ కట్టుమూరి మంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, ఎంఎస్పీ జిల్లా కోశాధికారి చెవ్వేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో పిల్లలకు మేలు



అంగన్వాడీ కేంద్రంలో ప్రమాణం చేస్తున్న తల్లులు

కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి తల్లి పాలప్రాధాన్యం వివరించారు. తల్లిపాలతో పిల్లలకు మేలు జరుగుతుందని తెలిపారు. పిల్లలకు తప్పనిసరిగా పాలు అందిస్తామని తల్లులతో ప్రమాణం చేయించారు. అంగన్వాడీ కార్యకర్త మహేశ్వరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 81 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,340	5,340
రెండో రకం	3,500	3,500
మూడోరకం	3,300	3,400

అనకాపల్లి సినిమాలు

శివం భజే	: రాజా
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
బడ్డీ	: సత్యనారాయణ స్క్రీన్-2
అలనాటి రామచంద్రుడు	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
పురుషోత్తముడు	: శ్రీసత్య
ఉషాపరిణయం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-12 యూనిట్లు, ఒ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 404 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

కుక్కలున్నాయి.. జాగ్రత్త

- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో మండల, పట్టణ ప్రజలు
- నియంత్రణపై కనిపించని జీవీఎంసీ, పంచాయతీ అధికారుల చర్యలు



రోడ్డుపై గుంపులు గుంపులుగా కుక్కలు

తుమ్మపాల: మొరిగే కుక్కలు కరవని అంటారు అది ఒకప్పుడు... ఇప్పుడు కుక్కలు పెద్దగా అరుస్తూ మీద పడి పిక్కలు పట్టుకుని గాయపరుస్తున్నాయి. రాత్రీపగలు అనే తేడా లేకుండా వెంటాడి కరుస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరిపైనా దాడి చేస్తున్నాయి. కుక్కలు సంతతి రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో గ్రామాల్లో వాటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఒక్కో గ్రామంలో సుమారు వంద వరకు, మండలంలో దాదాపు 2వేల వీధి కుక్కలు ఉంటాయని అంచనా. గ్రామ సింహాల బారిన పడి నిత్యం ఒకరో ఇద్దరో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ఆరు నెలల్లో మండలంలో 458 మంది కుక్క కాటుకు గురయ్యారు. అయితే నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. ప్రజలు ఫిర్యాదు చేస్తే ఎండార్స్‌మెంట్లతో సరిపెట్టి చేతులు దులుపుకొంటున్నారు.

మండలంలో తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, రేబాక, మామిడిపాలెం, మార్టూరు, వెంకుపాలెం, వేటజంగాలపాలెం, కూండ్రం, పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అవి వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి దిగుతున్నాయి. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారులపై మరింత ప్రమాదం

రహదారుల పక్కన గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని తుమ్మపాల–చోడవరం, అనకాపల్లి – పిసినికాడ, కొప్పాక–మారేడుపూడి గ్రామాలకు గల ప్రధాని రహదారిలో ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రహదారిపై వెళ్తున్న చోదకులపై గ్రామ సింహాలు దాడులకు దిగుతున్నాయి. ఇక్కడ ప్రమాదాల బారిన పడి గాయాలతో పలువురు ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి.

గ్రామాల్లో ఎక్కడైనా కుక్కకాటుకు గురైన వారు అధికారులను నిలదీస్తే కనీసం స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. కొత్తవారు గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లోకి అడుగు పెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో చీకటి పడితే శునకాల భయంతో ప్రజలు వీధుల్లోకి రావడం లేదు.

అధికారుల చర్యలేవి?

పట్టణంలోని పలు వార్డుల్లో, గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా వాటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కుక్కల దాడులతో ఆస్పత్రి పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళ్లి వారిని వెంబడించి దాడి చేస్తున్నాయని, కొన్నిసార్లు ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయని చెబుతున్నారు.

కుక్కలు దాడి చేస్తాయిలా...

కుక్కల నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శరవిధాల ప్రయత్నిస్తున్నారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. పెద్దవారినైతే కాళ్ల పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండడంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగంలోతు ఆధారంగా వైద్యులు చికిత్సకు సిఫార్సు చేస్తారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలక, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాలు నిర్వహించాలి.
- అన్ని వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దు.
- నియంత్రణకు స్థానిక సంస్థలు, పశుసంవర్ధక శాఖ సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలి.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచుకోవాలి.

బయటకు రావాలంటే భయమేస్తోంది

మండలంలో అనేక గ్రామాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది గ్రామాల్లో కనీసం 100 నుంచి 150 వరకు కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు వెంట నడుస్తుంటే వెంటబడి కరుస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కుక్కలు పట్టించేందుకు అధిక ఖర్చులు చూపిస్తు తప్పించుకుంటున్నారు.

–కరణం వరహాలు, రేబాక గ్రామం.

నివారణకు చర్యలు చేపడతాం



మండలంలో కుక్కల బెడదపై ఫిర్యాదు వస్తున్నాయి. గ్రామాల్లో కుక్కల ఎక్కువగానే ఉన్నాయి. స్టెరిలైజేషన్ అంశమై నివేదికలు అందజేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం. ఏదైన ఏజెన్సీ ద్వారా కుక్కలను పట్టి సుదూర ప్రాంతాల్లో తరలించేందుకు కార్యాచరణ చేపడతాం.

– శె.ధర్మారావు, ఈవోపీఆర్డీ, అనకాపల్లి మండలం

వయనాడ్ వరద బాధితులకు అండగా నిలవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: వరదల కారణంగా నిరాశ్రయులైన కేరళలోని వయనాడ్ వాసులకు అందరూ అండగా నిలవాలని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరావు అన్నారు. పట్టణంలో శనివారం పార్టీ ఆధ్వర్యంలో బాధితుల సహాయార్థం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్‌లో 300 మంది మరణించారని, వందలాదిమంది క్షతగాత్రులై ఆస్పత్రుల పాలైనట్లు చెప్పారు. దీనిని రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అన్ని విధాల ప్రజలను, వరద బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు సహాయం చేస్తున్నాయని, అదే విధంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బాధితులకు సహాయం చేయాలని ఆయన కోరారు. వయనాడ్ వరద బాధితులకు అండగా నిలిచేందుకు దేశ వ్యాప్తంగా సీపీఎం విరాళాలు సేకరణ చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్. శంకరరావు, అల్లు రాజు, మండల నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తెల్లయ్యబాబు, బి.ఉమామహేశ్వరావు, కె.ఈశ్వరావు, పి.చలపతి, కె.సుభాషిణి, బి.నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి: ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ఎంఈవోలు దృష్టి సారించాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆమె తెలిపారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఓపెన్ స్కూల్‌కు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందని, ఆయా మండలాల ఎంఈవోలు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈనెల 28 వరకూ ఆన్‌లైన్ అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు. గ్రామాల్లో రెగ్యులర్ విద్యకు దూరమైన విద్యార్థులు ఓ పెన్ స్కూల్ ద్వారా చదువుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

కోటవురట్ల : వరాహనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. కొత్త గొట్టివాడ ప్రాంతంలోని వరాహనది నుంచి ట్రాక్టరులో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి మెయిన్‌రోడ్డులో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. పోలీసుస్టేషన్‌కు తరలించి అపరాధ రుసుముగా రూ.10 వేలు విధించినట్టు తెలిపారు. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సత్తెమ్మ తల్లి నమోస్తుతే

- ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దాసరిగెడ్డ శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు ప్రసాద వితరణ చేశారు. రాజకీయ నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సుమారుగా 20 వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించి, 4 గంటలకు అమ్మవారి సారెఊరేగింపు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి అప్పారావు, కార్యదర్శి దాడి కృష్ణ, కోశాధికారి పెంటకోట అప్పారావు, గౌరవాధ్యక్షులు యల్లపు వెంకటరమణ, బొడ్డేడ సత్తిబాబు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం



గత ఏడాది లాంగ్ వాక్ నిర్వహిస్తున్న బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు (ఫైల్)

అనకాపల్లి: స్థానిక గవరపాలెంలో గల బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. 2001లో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం సందర్భంగా కుటుంబాల సమేతంగా పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి కార్యక్రమాలు... : ఉదయం 5 గంటలకు స్థానిక రింగ్‌రోడ్డులో లాంగ్‌వాక్‌ను మూడు విభాగాలుగా నిర్వహిస్తారు. గ్రూప్-1లో 15 నుంచి 30 సంవత్సరాలు, గ్రూప్-2లో 31 నుంచి 50 సంవత్సరాలు, గ్రూప్-3లో 51 సంవత్సరాలు వయసు పైబడిన వారికి లాంగ్ వాక్ నిర్వహిస్తారు. 8 గంటలకు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ చేస్తారు, సాయంత్రం విశాఖ జబర్దస్త్ టీం వారిచే 'హాస్యామృతం' తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

అనకాపల్లి: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం రాకుండా ప్రతి విద్యార్థి కొబ్బరి నూనెను మోకాళ్ల నుంచి కిందవరకూ రాసుకోవాలని, అలా రాసుకుంటే డెంగ్యూ దోమ కాటువేయకుండా రక్షణ పొందవచ్చని చెప్పారు. డెంగ్యూతో బాధపడుతున్న వారు పచ్చి యాలకుల గింజలను నమలకుండా నోటిలో ఉంచుకోవడం ద్వారా రక్త కణాలు నార్మల్‌గా మారుతాయని, ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ఉంటాయని ఆయన తెలిపారు. డెంగ్యూ, సాధారణ జ్వరం కారణంగా ఎవరికైనా ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉంటే వాటిని పెంచేందుకు హోమియోపతి ఔషధం బాగాపనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి..మరమ్మతులేవీ..



యండపల్లి-అన్నవరం రహదారి దుస్థితి

కోటవురట్ల : ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. ఏ ఊరెళ్లినా వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆదమరిస్తే గోతుల్లో పడి తీవ్రంగా గాయపడడం ఖాయం. ప్రధానంగా రాజుపేట, లింగాపురం, యండపల్లి–అన్నవరం రహదారుల్లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. పెద్ద గోతులు పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. యండపల్లి–అన్నవరం రహదారిలో అడుగుకో గొయ్యి ఉంది. దాంతో చీకట్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతు చేయాలని పలువురు కోరుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నక్కపల్లి : మండలంలో సీతంపాలెం గ్రామంలో శనివారం సచివాలయ కార్యదర్శి జయప్రకాష్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేపట్టినా చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లల చదువు అవనికే వెలుగని పేర్కొంటూ వారిని చదివిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది బ్యూలారాణి మాట్లాడుతూ మిషన్ శక్తి వందరోజుల ప్రణాళికలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కల్యాణ్, గ్రామంలో తల్లిదండ్రులు, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, సత్యవతి, అంగన్వాడీ సిబ్బంది లక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు నిలిపివేయాలి



తమ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

యలమంచిలి రూరల్ : తమకు నైట్ డ్యూటీలు నిలిపివేసి, అర్హత ఉన్న వారికి అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్వో పోస్టులకు పదోన్నతి కల్పించాలని గ్రామ రెవన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం యలమంచిలి డిప్యూటీ తహసీల్దార్ మురళికి వినతిపత్రం అంజదేశారు. వారికి సీఐటీయు జిల్లా నాయకుడు చింతకాయల శివాజీ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలు ఎన్నో రకాల సేవలందిస్తున్నారని, సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్వో పోస్టుల పదోన్నతులు కూడా చాలా కాలం నుంచి లేవని చెప్పారు. తక్షణమే వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు నిలిపివేయాలని, వేధింపులు ఆపాలని కోరారు. రాంబిల్లి మండలంలో హరిపురం వీఆర్ఏ జోగా నూకరాజును ఆ మండల డీటీ, వీఆర్వోలు అనేక రకాలుగా వేధిస్తున్నారని, మధుమేహంతో బాధపడుతున్న నూకరాజుకు రోజూ రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్దేశపూర్వకంగా డ్యూటీలు వేస్తూ ఇబ్బందులకు గురిచేయడం తగదని శివాజీ అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బూకా నరసింహులు, అప్పారావు, వరలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి దోహదం



పాఠశాల మైదానంలో మొక్క నాటుతున్న హెచ్ఎం

ఎస్.రాయవరం : పచ్చని చెట్లు ప్రగతి మెట్లు అని, కొరుప్రోలు ప్రధానోపాధ్యాయుడు సకురు సత్యనారాయణ అన్నారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు , విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలలో నాటుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ అవి ఎదిగేలా చూడాలన్నారు. విద్యార్థులు మొక్కలు పెంచడం అలవాటు చేసుకుంటే పరిసరాల నుంచి మంచి అవగాహన కలుగుతుందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2024–2025 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం (మూడో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐ ఎపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ప్రభుత్వ ఐటీఐ పాయకరావుపేటలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఒరిజినల్ ఎస్ఎస్‌సి, కులధ్రువీకరణ పత్రం, ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్, ఆధార్ లిక్ ఫోన్ నంబర్ కలిగి ఉండాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తుది గడువు ఈ నెల 27వ తేదీ కాగా, కౌన్సెలింగ్ 29వ తేదీన ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోని వారి పేరు మెరిట్ జాబితాలో ఉండదని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఐటీలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

సంపద కేంద్రాలను తనిఖీ చేసిన డీపీవో



పురుషోత్తపురంలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో శిరీషారాణి

యలమంచిలి రూరల్ : మండలంలోని పురుషోత్తపురం, బయ్యవరం గ్రామాల్లో గల సంపద తయారీ కేంద్రాలను శనివారం డీపీవో ఆర్. శిరీషారాణి తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త ఏరివేత ఎలా జరుగుతుందో ఆరా తీశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి సంపద కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సేంద్రియ ఎరువుల తయారీని విరివిగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కామేశ్వరావు, ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్: కేజేపురం జెడ్పీ హైస్కూలులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వడ్డాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల తల్లిదండ్రులు దినోత్సవం సందర్భంగా ఇక్కడ వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ నెల 26న నిర్వహించే మదర్ థెరిసా 114 జయంతిని పురస్కరించుకుని కరపత్రాలను సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు విడుదల చేశారు. హెచ్ఎం వి. దాసు, ఉపాధ్యాయులు సూర్రెడ్డి జగన్మోహన్, కె. అప్పన్నదొర, డి.బుల్లినాయుడు, జి. వెంకట్రావు, కె. ప్రసాదు పాల్గొన్నారు.

కొరుప్రోలు గ్రామానికి రోడ్డు ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ

రోలుగుంట: గిరిజన గ్రామం కొరుప్రోలుకు రహదారి ఏర్పాటు కోసం పంచాయతీ రాజ్ సిబ్బంది శనివారం సర్వే ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ ఇక్కడ ప్రజలతో కలసి రోడ్డు ఏర్పాటుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కృషి చేసిన సీపీఎం జిల్లా ప్రతినిధి కె.గోవింద, డీఆర్‌డీపీ పీడీ శచీదేవికి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.